వ్యంగ్య రచన

# కాదేదీ "కథ"లకనర్హం!

"మధుశ్రీ"

కథ వ్రాయాలని ఆలోచిస్తాను. ఏం వ్రాయను? ఏ రచయితా స్పృశించకుండా ఒదిలినదేదీ లేదు. కాని కథ వ్రాయాలి. 'అరటి తొక్క, బల్ల చెక్క' కవితా వస్తువులైనప్పుడు నాకు కథావస్తువు కనబడక పోవడమేమిటి? కాదేదీ కవిత కనర్హం అన్నాడు కదూ' అభ్యుదయ కవి! కథకూడా కవిత్వమే కదూ? కనక నేనంటాను "కాదేదీ కథ కనర్హం" అని.

సుబ్బారావు కిళ్లీకొట్టుదగ్గర బయలుదేరింది మొదలు ఆఫీసుకి వెళ్ళేవరకూ ఓ కథ అవదూ? సుందరి వీధిగుమ్మంలో నిలబడి దొడ్డిలో నూతి చపటా వరకూ ఒయ్యారంగా వెళ్లడం ఒక కథ అవదూ?

అదీ కాక ఈమధ్య కథలో సిగరెట్లూ, అగ్గిపెట్లూ ఎక్కువగా ఉంటున్నాయి. మావాడు అన్నట్లు — "నాకొక సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె ఎదురుగుండా ఉంటే కథ వ్రాసేస్తాను" అలా ఉంది. ఎన్నికథలు చూసినా సిగరెట్ లేని కథలు కనబడ్డంలేదు. కథానాయకుడు సిగరెట్ వెలిగించాడనో వాళ్లావిడ సిగరెట్టు నోట్లోపెట్టి అగ్గిపుల్ల గీసిందనో వ్రాయకుండా ఏ రచయితా వూరుకోలేక పోతున్నాడు. కథకి సిగరెట్టు ఒక ముఖ్యాంగం అయిపోయింది. అంతకన్న కథ ఆయువుపట్టు అంటే బాగుంటుందేమో!

అటువంటి ప్రాముఖ్యత వహించిన సిగరెట్ మీద ఓ కథ ఎందుకు వ్రాయకూడదు?

ఏం వ్రాయను?

సిగరెట్టుని ఓ కథానాయకిని చేస్తే! ...

కథంతా సిగరెట్టే!

* * *

"ఒసేవ్! — సిగరెట్ పెట్టె ... ఎక్కడా?" అని విసుగ్గా కేక పెట్టాను. వంటింట్లో పని చేసుకుంటున్న మా ఆవిడ "వస్తున్నానుండండి" అంటూ జవాబిచ్చింది.

"అబ్బ త్వరగా రావాలే ... భావాలన్నీ పోతున్నాయి... గబగబ ఓ సిగరెట్టు వెలిగిస్తే ఓ కథ పూర్తయి పోతుంది. రేడియోవాళ్లు రేపటి కందేలా పంపమన్నారు ..." అని కంగారు పెట్టాను.

తువ్వాలుతోటి చెయ్యితుడుచుకుంటూ వచ్చి నిలబడింది మా ఆవిడ

"ఏమిటంటారూ?"

"సిగరెట్ పెట్టె ఏదీ అంట?"

"ఏమో నేనేదో కాల్చేసినట్లు నిలవదీస్తారేమిటి?" అని టొకాయించింది.

"సరే నిన్నడిగేకంటే వెతుక్కోవడంమెరుగు" అని డ్రాయర్ సొరుగుపూర్తిగా ఇవతలకి లాగాను. కాగితాలన్నీ చిందర వందరగా పడివున్నాయి. అన్నీ ఇవతల గుమ్మరించాను. సిగరెట్ రాణిగారు మటుక్కు కనబడలేదు. ఆవిడకి ఘోషా మరి! ఎక్కడ ఏ పరదాల మాటుని ఉన్నారో! ...

కాగితాలన్నీ గిరవాటు పెట్టాను.

కాలికి అడ్డంవచ్చిన జోళ్లను తన్నాను. కుర్చీ జరిపాను. కలం మూత తెరచి మళ్లీ ఉంచాను పెనసలుతీసి నుదుటిని కొట్టుకుని బల్లమీద పెట్టాను ... గది నలుమూలలా వెదికాను.

కనబడ లేదు.

సమయం మించిపోతూంది.

ఎలా? ఎలా?

భావ పరంపరలు ఆగిపోతే!

మళ్లీ మంచికథ వ్రాయగలనా?

మా ఆవిడమీద 'ధూంధాం' అని ఎగిరాను. ఆవిడ వినిపించుకోకుండా వంటింట్లోకి చక్కాపోయింది.

పదయిపోయింది...

భోజనం కాలేదు. భోజనం

కాగితంమీద కలం సాగడంలేదు. అసలైన నాయికే లేనప్పుడు కథెలా సాగుతుంది! ఇంపాజిబుల్!! దివ్యదృష్టిలో చూద్దాం అన్నట్లు కుర్చీలో వెనక్కి వాలాను. ఆలోచనలో మునిగి పోయేను.

అదిగో! మిస్ కేప్స్టెన్ నేవికట్!

బంగారపురంగు నైలాన్ చీర కట్టుకుని సువర్ణచ్ఛాయలో ధగధగ మెరిసిపోతూంది. అలాంటి సౌందర్యం ఎక్కడా చూడలేదు. ఆ చూపుల్లో కన్నె ప్రేమలు ప్రతిఫలిస్తున్నాయి. ఆహ్వానాలున్నాయి.

"కేప్స్టెన్!" పిలిచాను.

గ్రీవాభంగాభిరామంగా చూసి కళ్లల్లో అనురాగా లొలికించి మందగమనలా వనమయూరిలా చక్కాపోయింది.

ఆహా! ఇలాంటి సౌందర్యరాశిని చేపట్టనివాడి జీవితం కూడా ఒక జీవితమేనా? మానవ జన్మ ఎత్తినందు కధన్యులు కావాలంటే ఆ సుందరిని వివాహం చేసుకోవాలి. ఆమెతో కాపురం సాగించి విషయవాంఛా పరితృప్తులు కావాలి!

అదిగో నన్నే పిలుస్తూంది ...

మృగమదాల పరీమళాలా

చందన చర్చలతో గుబాళించే శరీరం

వలిపట్టు పయ్యెదలో దోబూచులాడే పయోధరాలూ ...

ఆహాహ ...

వెడతాను. ఆమె లేనిదే జీవితంలేదు. పరుగు పెట్టాను ... అందీ అందకుండా సరాగాలు పోతూ వన్నుకూడా తిప్పకుంది.

"కెప్స్టెన్" పిలిచాను.

ఏం అన్నట్లు కనుబొమలు ఎత్తింది.

"ఎందుకు నన్నిలా బాధిస్తావ్?"

"ఎవరు బాధపడమన్నారు?"

"ఒకళ్లు పడమనేదేమిటి? నీ అందం చేతులెత్తి పిలుస్తుంటే!"

"అయితే అందంగా ఉండడం తప్పేనన్న మాట!" చమత్కరించింది యవ్వనం పొంగులు వారుతున్న తన శరీరాన్ని ఒకసారి చూసుకుని.

"తప్పన్నానా? అదికాదు. అందంనీసొమ్ము.. ఆనందించడం నా సొమ్ము...."

"అయితే ఆనందించండి" అంటూ ఉల్లిపొరలా ఉన్న పైటకొంగు విసిరింది. వాతావరణం అంతా ఘుమఘుమలతో నిండిపోయింది. గాలిలో తేలిపోయింది—పైట గాలిపటంలా. ఫెయిరీ టేల్స్‌లో దేవతలు జ్ఞాపకానికి వచ్చేరు. ఇలా ఉండేవారు కాబోను అనుకున్నాను.

గాలిలో తేలిపోతూంది..

"చేతికందవు....ఎలా?" అన్నాను.

పకపక నవ్వింది.

నవ్వుల్లో ముత్యాలొలికాయి.

అంతట్లోనే నా ప్రక్కనుంచి దూసుకుని ఫియట్ కారువచ్చి ఆగింది. కారులోంచి ఘుమఘుమలు వస్తున్నాయి.

"కేప్స్టెన్" అని మృదువుగా ముద్దు పిలిచింది ఒక మగగొంతు కారులోంచి.

గాలిలో తేలుతున్న ఆమె, ఆసుందరి పిలిచి మీటినట్లుగా పలికింది.

నా హృదయతంత్రులు వాటితో బాటు ప్రకంపించాయి. కంఠంలో ఎంత తీయదనం ఉంది.....

"పోదాం రా" అన్నాడు కారులో ఆయన తలుపుతీసి ఇవతలికి వచ్చి నిలబడి. ఆయన బ్రహ్మాండమైన సూటులో ఉన్నాడు. కాని మెడలో పువ్వుల దండలు....చేతిలో మల్లెపూల బంతులు సున్నితంగా పట్టుకుని నిలబడ్డాడు. ఆయన చేతిలోనున్న విరిదండకీ, మిస్ కేప్స్టెన్‌కీ నాకు తేడా కనబడలేదు.

"ఊహు..."అంది గారాలరాగాలు ఆలాపిస్తూ. మురిపించింది. మురిపించి కులికించింది. కులికించి పులకింపజేసింది.

"ఎక్కడికి పోతావో చూస్తానుగా.." అంటూ

ఆయన ఆమెను పట్టుకుందుకు పరుగు పెట్టాడు.

ఆమె కిలకిల నవ్వింది.

నవ్విననవ్వులో సెలయేటి గలగలలు వినిపించాయి. మహతీస్పందనాలు వినిపించాయి.

చెయ్యి పట్టుకున్నాడు.

పకపక నవ్వింది.

"సినిమాకి పోదాం రా" అన్నాడాయనా కారు వైపు ఆమెని నడిపిస్తూ.

"నాకేప్స్టెన్...నా హృదయరాణి..రాణి.." ఉద్రేకంతో అరిచాను.

కాని వినిపించుకుంటేనా!

ఆయన సున్నితమైన వ్రేళ్ల సందుని వెచ్చని కౌగిలి 'అనుభవిస్తూ, తన్మయత్వం చెందుతూంది.

నాకేసి చూసి నవ్వుతూ — "బై...బై..." అంది చెయ్యి ఆడిస్తూ. ఆ నవ్వులో "ఓయి వెర్రివాడా... ఎందుకు నీకీ పిచ్చి. అందని ఆశలు పెంచుకోకు అనే ధోరణిలో నవ్వింది.

"మిస్ కేప్స్టన్.... కేప్స్టన్...."

* * *

"ఏమిటండీ ... పగలే కలలు కంటున్నారా? కలవరిస్తున్నారా?"

"అబ్బే..."

"వెధవది — ఒక సిగరెట్ కనబడకపోతే అంత కలవరింతలేమిటండీ?"

"నాకు నువ్వెలాగో ... సిగరెట్టూ అలాంటిదే! చూశావా సిగరెట్టు కనబడక కథ అడ్డిపోయింది"

"ఆ ... ఆ... మతిలేకపోతే సరి — లెద్దురూ భోజనం చేద్దాం ..." అంటూ నా చేతిలో ఉన్న కలం లాక్కుని కాగితాలూ, కలం టేబిల్ మీద పడేసింది.

"రండి" అంటూ రెక్కపట్టుకుని కుర్చీలోంచి లేవదీసింది. ఆవిడ తలలో ఉన్న వెయ్యి మల్లెపూల దండలోనూ ఉన్న పూలు సౌరభాలు వెదజల్లుతూ నవ్వుతున్నాయి. కదలకేం చెయ్యను.

సిగరెట్ ఒక కథా వస్తువైనప్పుడు, అంత కన్నా అనేక కథలు అందమైనవి మా ఆవిడమీద వ్రాయవచ్చుననిపించింది.

(శ్రీశ్రీ కిపాలజీస్‌తో)



లేపాక్షి కుడ్య చిత్రం